నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 మహబూబ్‌నగర్, గురువారం 9 జనవరి 2025 MAHABUBNAGAR NARAYANPET

- యాసంగికి సాగునీటి కేటాయింపులు
- ప్రణాళిక విడుదల చేసిన అధికారులు
- వారబంది పద్ధతిలో ఇవ్వాలని నిర్ణయం
- ఏప్రిల్ 15 వరకు కొనసాగింపు
- పంటల సాగు పనులు నిమగ్నమైన రైతులు


జూరాల ప్రాజెక్టు

# 96,645 ఎకరాలకు నీళ్లు

గద్వాల, జనవరి 8 : యాసంగి రైతులకు తీపికబురు అందింది. సాగయ్యే పంటలకు నీటి ఢోకా లేకుండా సరిపడా సాగునీరు అందించాలని రాష్ట్రస్థాయి సాగునీటి విడుదల ప్రణాళిక కమిటీలో నిర్ణయం తీసుకున్నారు. నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ అనిల్‌కు మార్‌అధ్యక్షతన జల సౌధలో సమావేశమైన కమిటీ ప్రాజెక్టుల వారీగా నీటి లభ్యత.. ఎగువ నుంచి రానున్న ప్రవాహాన్ని అంచనా వేసి నీటి ప్రణాళికను విడుదల చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో వివిధ ప్రాజెక్టుల కింద యాసంగిలో సుమారు 96,645 ఎకరాలకు నీళ్లు అందించాలని నిర్ణయం తీసుకున్నారు. గతేడాది వానకాలంలో సమృద్ధిగా వానలు కురవడంతో జిల్లాలోని జూరాల, నెట్టెంపాడు, ఆర్డీఎస్ ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. దీంతో ప్రస్తుతం ఆయా ప్రాజెక్టుల్లో ఉన్న నీటి లభ్యత ఆధారంగా ప్రభుత్వం యాసంగి పంటలకు నీళ్లించేందుకు సిద్ధమైంది. దీంతో ఈ ఏడాది పంటలు సాగు చేసే రైతులకు సాగునీటి ఇబ్బందులు ఉండవు.

**గత యాసంగిలో క్రాప్‌హాలీడే..**

గత ఏడాది అనుకున్న స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో యాసంగి పంటల సాగు నాటికి ప్రాజెక్టుల్లో నిల్వలు తగ్గిపోయాయి. కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంల్లో నీరులేక పోవడంతో ఆ ప్రాజెక్టుల కింద పంటలకు క్రాప్‌హాలీడే కూడా ప్రకటించారు. గద్వాల జిల్లాలోని జూరాల, నెట్టెంపాడు, గుడ్డెం దొడ్డి, ర్యాలంపాడ్ రిజర్వాయర్లలో నీళ్లు అడుగంటాయి. దీంతో 15 ఏండ్ల తర్వాత మొదటి సారి గతేడాది యాసంగిలో అధికారులు క్రాప్ హాలీడే ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి ఏడాదిలోనే వర్షాలు కురకవపోవడం రైతులు ఇబ్బందులు పడ్డారు. దీని తోడు గత వానకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వకపోవడం.. యాసంగి సీజన్‌లో క్రాప్‌హాలీడే ప్రకటించడంతో కర్షకులు పంటలు పండక.. చేతిలో చిల్లి గవ్వ లేక ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. అయితే వర్షాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవడం.. ప్రాజెక్టులకు ఎగువ నుంచి వరద రావడం.. పంటలు బాగా పండడంతో రైతులకు కొంత ఊరట లభించింది. యాసంగి విషయానికొస్తే వివిధ ప్రాజెక్టుల ఆయకట్టు పంటలకు నీటిని విడుదల చేస్తామని అధికారులు చెప్పారు. దీంతో రైతులు పంటలు సాగు పనులు మొదలు పెట్టారు.

**ప్రాజెక్టు వారీగా నీటి కేటాయింపులు**

రాష్ట్రస్థాయి సాగునీటి విడుదల ప్రణాళిక కమిటీలో జిల్లాలోని ప్రాజెక్టుల వారీగా ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించాలన్న వివరాలను అధికారులు వెల్లడించారు. జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వ ద్వారా 34,345 ఎకరాలకు.. నెట్టెంపాడు ప్రాజెక్టు (గుడ్డెం దొడ్డి, ర్యాలంపాడ్) పరిధిలో 24,800 ఎకరాలకు, ఆర్డీఎస్ పరిధిలో 37,500 ఎకరాలకు అందించాలని నిర్ణయించారు. అలాగే చెరువులు, చిన్న ఎత్తిపోతల పథకాల కింద సాగునీరు అందించనున్నారు. 2025 ఏప్రిల్ 15 వరకు నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ఈ యాసంగి పంటలకు సాగునీటి ఢోకా ఉండదు.


ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద ప్రస్తుత నీటిమట్టం

**వారబంది పద్ధతిలో విడుదల : పీజేపీ ఎస్ఈ**




జూరాల, నెట్టెంపాడ్, ఆర్డీఎస్ ప్రాజెక్టుల కింద వారబంది ద్వారా నీటిని విడుదల చేస్తున్నట్లు జూరాల ఎస్ఈ రహిముద్దీన్ తెలిపారు. పీజేపీ కుడి కాల్వ కింద డీ-31 వరకు నీటిని అందిస్తామన్నారు. వారంలో నాలుగు రోజులుపాటు నీటిని విడుదల చేస్తామని, మరో మూడు రోజులు నిలిపివేస్తామన్నారు. రైతులు కేవలం ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేసుకోవాలని సూచించారు. నెట్టెంపాడు లిఫ్ట్ కింద డీ-2, డీ-5 పరిధిలో నీటిని అందిస్తామన్నారు. అయితే నాలుగు రోజులు అందించి.. ఆరు రోజులు నిలిపి వేస్తామని తెలిపారు. ఆర్డీఎస్ పరిధిలో డీ-30 వరకు సాగునీళ్లు పారిస్తామని చెప్పారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకొని ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలన్నారు. ఆర్డీఎస్ కింద రైతుల అవసరం మేరకు మాత్రమే విడుదల చేస్తామని తెలిపారు. తుమ్మిళ్ల పంపులకు నీరు అందక పోవడం వల్ల రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఆర్డీఎస్‌కు 5.9 టీఎంసీల నీటి అలాట్‌మెంట్ ఉందని, ప్రస్తుతం ఆర్డీఎస్ ద్వారా 1.04 టీఎంసీలు విడుదల చేశారన్నారు. కర్ణాటక నుంచి రీ జనరేటర్ వాటర్ అనుకున్న స్థాయిలో రానందువల్ల జూరాల పరిధిలో ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేసుకోవాలన్నారు.

# రామాపురంలో తాగునీటి ఎద్దడి


కొల్లాపూర్ రూరల్ : రామాపురంలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న ప్రజలు

- రోడ్డెక్కిన గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు

కొల్లాపూర్ రూరల్, జనవరి 8 : కొల్లాపూర్ మండలం రామాపురం గ్రామంలో ఏడో వార్డుతోపాటు వివిధ వార్డుల్లో దాదాపు నెల రోజుల నుంచి తాగునీటి ఎద్దడి నెలకొన్నది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఖాళీ బిందెలతో గ్రామస్తులు ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. వీరికి సామాజిక నాయకుడు చంద్రయ్యయాదవ్ తదితరులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లాల ద్వారా నీటిని సరపరా చేసేవారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం తంటాలు పడాల్సిన పరిస్థితి నెలకొన్నది. కనీసం మిషన్ భగీరథ పథకం నిర్వహణను సైతం పట్టించుకోక పోవడంతో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొన్నంది. ఒక మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో కూడా ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి కైనా అధికారులు స్పందించి తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని, లేదంటే మంత్రి జూపల్లి కృష్ణారావు ఇంటి ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సామాజిక నాయకుడు ఆనుకమోని చంద్రయ్య యాదవ్‌తోపాటు కాలనీకి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.


కర్ణాటకలోని తుంగభద్ర డ్యాం నుంచి నదిలోకి విడుదలవుతున్న నీరు

# సెకండ్ ఇండెంట్

- టీబీ డ్యాం నుంచి ఆర్డీఎస్‌కు నీటి విడుదల
- 17 వరకు కొనసాగింపు.. మూడ్రోజుల్లో ఆనకట్టకు..
- ఈసారైనా తుమ్మిళ్లకు సాగునీరు చేరేనా..?

అయిజ, జనవరి 8 : ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలోని యాసంగి పంటలకు 1500 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. 2024-25 ఏడాదికి గానూ ఆర్డీఎస్‌కు కేటాయించిన 5.896 టీఎంసీల నీటి వాటా నుంచి మొదటి విడుతలో గత డిసెంబర్ 26 నుంచి ఈనెల 5 వరకు 1.078 టీఎంసీలు వదిలారు. రెండో విడుతలో 10 రోజులపాటు 1.04 టీఎంసీని విడుదల చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ ఈఎన్‌సీ అనిల్‌కుమార్ మంగళవారం ఇండెంట్ పెట్టారు. దీంతో టీబీ బోర్డు అధికారులు బుధవారం డ్యాం నుంచి నీళ్లు వదిలారు. ఐదు రోజులు 1500 క్యూసెక్కులు, చివరి ఐదు రోజులు వెయ్యి క్యూసెక్కుల చొప్పున ఇవ్వాలని నిర్ణయించారు. శనివారం నాటికి నీళ్లు కర్ణాటకలోని ఆర్డీఎస్‌కు చేరుతాయని ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ ఏడాది ఐఏబీ సమావేశంలో ఆర్డీఎస్ పరిధిలో 37 వేల ఎకరాల ఆరుతడి పంటలకు నీళ్లివ్వాలని నిర్ణయించారని, అందుకనుగుణంగా విడుదలకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**ఆనకట్టలో తగ్గుతున్న నీటిమట్టం**

ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద నీటినిల్వలు క్రమేపీ తగ్గుతున్నాయి. 238 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, ప్రధాన కాల్వకు 138 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 50 క్యూసెక్కులు స్లూయిస్ ద్వారా దిగువకు ప్రవహిస్తున్నాయి. ప్రస్తుతం ఆనకట్టలో 5.3 అడుగుల నీటి మట్టం ఉన్నది. కాగా టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో నిలిచిపోగా, అవుట్‌ఫ్లో 8,270 క్యూసెక్కులుగా నమోదైంది. పూర్తిస్థాయి సామర్థ్యం 105.788 టీఎంసీలు ఉండగా.. ప్రస్తుతం 75.580 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు బోర్డు సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

**తుమ్మిళ్ల పంపునకు అందేనా..?**

టీబీ డ్యాం నుంచి విడుదలైన నీరు ఆర్డీఎస్ వరకే చేరింది. ఆయకట్టు పరిధిలోని డీ-20 వరకు అంతంత మాత్రమే చేరాయి. ఆర్డీఎస్, తుమ్మిళ్ల పంపునకు నీరు చేరేందుకే అధికారులు రెండు విడుతలుగా ఇండెంట్ పెట్టి టీబీ డ్యాం నుంచి నీటిని విడుదల చేయించారు. కానీ కర్ణాటక, ఏపీ రాష్ట్రాల్లోని ఎత్తిపోతల పథకాలు, అక్కడి రైతులు ఏర్పాటు చేసిన భారీ మోటర్ల కారణంగా ఆర్డీఎస్ ఆనకట్టకు చేరాల్సిన నీటిని పూర్తిస్థాయిలో రావడం లేదు. నీటి లభ్యత లేని కారణంగా తుమ్మిళ్ల పంపును పూర్తిగా నిలిపివేశారు. సుంకేసుల బ్యారేజీలో ఎఫ్ఆర్‌ఎల్ పడిపోయింది. ఈ సారైనా తుమ్మిళ్ల పంపునకు నీరు అందింతే ఆయకట్టుకు సాగునీరు అందుతుందని, లేకుంటే సాగు ప్రశ్నార్థకమే అని రైతులు ఆందోళన చెదుతున్నారు. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో వ్యవహరించి కేసీ కెనాల్ నీటి వాటాను తుంగభద్ర నదిలో విడుదల చేయించేందుకు కృషి చేయాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు. అప్పుడు ఆర్డీఎస్, తుమ్మిళ్ల ఆయకట్టుతోపాటు ఏపీలోని కేసీ కెనాల్ రైతులు, ఎత్తిపోతల పథకాలకు నీటి కొరత తీరుతుందన్నారు.

# చిన్నారిని చిదిమేసిన ట్రాక్టర్


ట్రాక్టర్ ప్రమాదంలో మృతిచెందిన రిషిక

- ప్రమాదానికి రివర్స్‌లో వేగమే కారణం
- టైర్ కింద పడి బాలిక మృతి
- కుటుంబంలో విషాదం

గట్టు, జనవరి 8 : ఓ ట్రాక్టర్ చిన్నారిని చిదిమేసిన ఘటన తుమ్మలపల్లిలో మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. సంధ్య, హుస్సేన్‌ల కూతురు రిషిక(4) ఇంటి ముందున్న రోడ్డు పక్కన ఆడుకుంటోంది. ఈ సమయంలో సమీపంలోని బోయ సత్తెమ్మ ఇంటి వద్దకు ఇటుకలోడ్‌తో కర్ణాటక నుంచి ట్రాక్టర్ వచ్చింది. ఇటుకను అన్‌లోడ్ చేసిన తరువాత డ్రైవర్ ట్రాక్టర్‌ను వేగంగా, అజాగ్రత్తగా రివర్స్ చేయడానికి ఉపక్రమించాడు. ఈ సమయంలో అక్కడే ఆడుకుంటున్న రిషిక ప్రమాదవశాత్తు ట్రాలీ ఎడమవైపు టైర్ కింద పడింది. దీంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. పాప మృతితో సంధ్య, హుస్సేన్‌ల కుటుంబంలో విషాదం అలముకుంది. సంధ్య ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కేటీ మల్లేశ్ తెలిపారు.

# పీయూలో ఉద్రిక్తత

- విద్యార్థుల మధ్య ఘర్షణ
- పోలీసుల రంగ ప్రవేశం..
- కౌన్సెలింగ్ ఇచ్చి సర్దిచెప్పిన సీఐ, రిజిస్ట్రార్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జనవరి 8 : పాలమూరు యూనివర్సిటీలో బుధవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వర్సిటీ పీజీ కళాశాల మైదానంలో ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ వసతి గృహం, పీజీ బాయ్స్‌హాస్టల్ విద్యార్థులు రెండు జట్లుగా ఏర్పడి క్రికెట్ ఆడారు. ఈ నేపథ్యంలో ఇద్దరు క్రీడాకారుల మధ్య చిన్నపాటి వివాదం చిలికిచిలికి గాలివానలా మారింది. ఇరువర్గాల వారు తలపడే పరిస్థితులు నెలకొనడంతో విద్యార్థి సంఘాల నాయకులు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా.. ఒకరినొకరు తోసుకుంటూ గొడవకు దిగారు. పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం ఉందని భావించిన అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ గాంధీనాయక్, ఎస్సైలు, సిబ్బందితో మూడు పోలీసు వాహనాల్లో అక్కడికి చేరుకున్నారు. పీయూ రిజిస్ట్రార్ ఆచార్య చెన్నప్ప, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, పోలీసుల సహకారంతో విద్యార్థులను సముదాయించారు. అనంతరం ఇరువర్గాల వారిని వేర్వేరుగా కూర్చోబెట్టి గొడవకు దారి తీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి విద్యనభ్యసించేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి.. చిన్నపాటి వివాదాలకు జీవితాలను నాశనం చేసుకోవద్దంటూ సీఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఒకరికొకరు తోడుగా చదువుకుంటూ సందేహాలు నివృత్తి చేసుకుంటూ ఉన్నత విద్యలో మరింత మెరుగ్గా రాణించేందుకు కృషి చేయాలన్నారు. స్నేహపూరిత వాతావరణంలో క్రీడలు నిర్వహించుకోవాలని సూచించారు. సమస్యలు సృష్టించుకోవడం ద్వారా లక్ష్యసాధనలో వెనుకబడి పోవడం తప్పితే ఒరిగేదేమీ ఉండదనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదువుపై దృష్టి సారించి ఉద్యోగాలు సాధించాలని రిజిస్ట్రార్ ఆచార్య డీ చెన్నప్ప విద్యార్థులకు సూచించారు. ఏదైనా సమస్యలు ఎదురైతే నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ క్రమశిక్షణ వీడొద్దన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు చోటుచేసుకుండా చూడాలని వర్సిటీకి మరింత మంచిపేరు తేవాలని, చెడ్డపేరు తెచ్చేలా ఎవరు ప్రవర్తించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ రూరల్ సీఐ గాంధీనాయక్


పీయూ పీజీ కళాశాల వద్ద ఉద్రిక్తత పరిస్థితుల్లో విద్యార్థులు

# కూల్చిన దుకాణం నిర్మించేదెప్పుడు..?

- హైకోర్టు ఆదేశాలను పట్టించుకోని వైనం
- మరో రెండువారాలు గడువు కావాలన్నా పంచాయతీ అధికారులు
- రోడ్డు పాలైన బీఆర్ఎస్ మాజీ ఉపసర్పంచ్ కుటుంబం

దోమలపెంట, జనవరి 8 : అమ్రాబాద్ మండలం దోమలపెంటలో గత నెల 11వ తేదీన పంచాయతీ కార్యదర్శి జేసీబీని పెట్టి బస్టాండ్ పక్కన ఉన్న కటకం నాగలక్ష్మి, దర్గా ఎదురుగా ఉన్న బీఆర్ఎస్ మాజీ ఉపసర్పంచ్ కటకం మహేశ్ దుకాణాలు కూల్చివేశారు. అయితే దుకాణాలు కూల్చివేసిన స్థలం విషయంలో బాధితుడు అప్పటికే హైకోర్టును ఆశ్రయించగా కోర్టు పంచాయతీ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎక్కడైతే బాధితుడికి చెందిన నిర్మాణం కూల్చివేశారో అక్కడ వెంటనే నిర్మాణం చేపట్టాలని కోర్టు ఆదేశించింది. దీంతో పంచాయతీ అధికారులు బాధితుడు మహేశ్‌కు రెండు వారాల్లో కట్టిస్తామని హామీపత్రం రాసిచ్చారు. రెండువారాల గడువు ముగుస్తున్నా రెండు రోజులు మాత్రమే పనులు చేసి చేతులు దులుపుకున్నారు. అంతేకాకుండా అధికారులు షాపుల నిర్మాణానికి మరో రెండు వారాలు గడువు కావాలని న్యాయస్థానాన్ని కోరుతున్నారు.


ఈ సందర్భంగా బాధితులు మహేశ్ మాట్లాడుతూ న్యాయస్థానంలో కేసు నడుస్తున్నదని మా దుకాణాలు కూల్చవద్దని వేడుకున్నా పంచాయతీ అధికారులు వినకుండా కూల్చివేశారని ఆరోపించారు. కూల్చివేయడంలో ఉన్న శ్రద్ధ నిర్మించడంతో మాత్రం చూపించడం లేదని వాపోతున్నారు. అధికారుల నిర్వాకం వల్ల మేము ఉపాధిని కోల్పోయి రోడ్డు మీద పడాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.


కూల్చివేసిన బీఆర్ఎస్ మాజీ ఉపసర్పంచ్ మహేశ్‌కు చెందిన దుకాణాలు (ఫైల్)

## రోడ్డు ప్రమాదంలో తల్లీకూతుళ్ల మృతి

కల్వకుర్తి రూరల్, జనవరి 8 : హైదరాబాద్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీ కూతుళ్లు మృతి చెందిన ఘటన బుధవారం తిమ్మరాశిపల్లిలో చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మరాశిపల్లికి చెందిన గోపాల్, లక్ష్మమ్మ కూతురు విజయ కల్వకుర్తి పట్టణంలో చదువుకుంటున్నది. ఇటీవల విజయ అస్వస్థతకు గురికావడంతో వైద్యులను సంప్రదించగా రక్తకణాలు తక్కువగా ఉన్నాయని, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో బుధవారం ఉదయం గోపాల్, లక్ష్మమ్మ, విజయ బైక్‌పై హైదరాబాద్‌కు బయలుదేరారు. హైదరాబాద్‌లోని పహాడీషరీఫ్ వద్ద బైక్‌ను డీసీఎం ఢీకొట్టడంతో లక్ష్మమ్మ, విజయ అక్కడికక్కడే మృతిచెందగా, గోపాల్‌కు కాలు విరిగింది. తల్లీ కూతుళ్ల మృతితో గ్రామంలో పూర్తిగా విషాద ఛాయలు అలుముకున్నాయి.

# స్వల్పంగా తగ్గిన ఉల్లి ధర


దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లికి టెండర్లు వేస్తున్న వ్యాపారస్తులు

- క్వింటాకు గరిష్ఠంగా రూ.3,510, కనిష్ఠంగా రూ.2,260 రేటు

దేవరకద్ర, జనవరి 8 : మార్కెట్‌లో ఉల్లి ధరలు స్వల్పంగా తగ్గాయి. బుధవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు బుధవారం దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌కు ఉల్లిని విక్రయించేందుకు భారీగా తీసుకువచ్చారు. అయితే స్థానిక వ్యాపారుల తోపాటు బయటి నుంచి వ్యాపారులు సైతం టెండర్లు వేయడంతో ఉల్లికి గత వారం కంటే స్వల్పంగా గరిష్ఠంగా రూ.3,510; కనిష్ఠంగా రూ.2,260కి తగ్గింది. అయితే మార్కెట్ నిబంధనల ప్రకారం 45 కిలోలు తూకం వేసి విక్రయించినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

- ఒకరి మృతి
- మాచర్లలో ఘటన


సిఖిందర్ (ఫైల్)

గట్టు, జనవరి 8 : మండలంలోని మాచర్లలో రెండు కుటుంబాల మధ్య ఘర్షణ ఒకరి మృతికి కారణమైంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సైకిల్‌షాప్ మస్తాన్, అల్లావుద్దీన్ ఇండ్లు ఒకే వీధిలో ఉన్నాయి. ఈ వీధిలో ఇటీవలనే సీసీ రోడ్డును నిర్మించారు. అయితే సీసీ రోడ్డు నిర్మాణం విషయంలో రెండు కుటుంబాల మధ్య వివాదం రాజుకుంది. ఇది చిలికిచిలికి గాలివానలా మారింది. కాగా మస్తాన్, అల్లావుద్దీన్ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగిన క్రమంలో ఒకరు పంక్చర్ చేసే ట్యూబ్‌లెస్ కిట్‌తో పొడవగా రాయిచూర్‌కు చెందిన సిఖిందర్(25) మృతి చెందాడు. ఈ విషయంలో పోలీసులకు ఫిర్యాదు అందలేదని తెలిసింది.

# మేడం నాకు ధైర్యం ఇచ్చారు

- రిటైర్డు ఏఆర్ ఎస్సై సాధిక్



భూత్పూర్, జనవరి 8 : పట్టణ కేంద్రానికి చెందిన మహ్మద్ సాధిక్ అలీ ఏఆర్ ఎస్సైగా ఉద్యోగం చేస్తూ గత ఏప్రిల్(2024)నెలలో ఉద్యోగ విరమణ చేశారు. ఉద్యోగ విరమణ చేసి దాదాపు ఏడు నెలలు గడుస్తున్నా బెన్‌ఫిట్స్‌రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సాధిక్‌అలీ ఆర్థిక సమస్యల మూలంగా ఆత్మహత్య చేసుకుంటానని మంగళవారం రాత్రి ఓ వీడియో చేసి సోషల్ మీడియాలో విడుదల చేశారు. ఈ వీడియో వైరల్ అయ్యి ఎస్పీ కార్యాలయానికి చేరడంతో ఎస్పీ జానకి సాధిక్‌అలీని కార్యాలయానికి పిలిపించుకొని మాట్లాడారు. ఈ సందర్భంగా పూర్తి వివరాలను తెలుసుకొని నీకు రావాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ వచ్చేలా చర్యలు తీసుకుంటామని ధైర్యం చెప్పినట్లు పేర్కొన్నారు. దీంతో ఆయన ఎస్పీ మేడం ఓదార్పు నాకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని, ఆమెకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ విషయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం సాధిక్‌అలీ సమస్యపై స్పందించారు. అదేవిధంగా భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ సత్తూరు బస్వరాజ్‌గౌడ్ సాధిక్‌అలీని కలిసి పరామర్శించారు. ఏఆర్ ఎస్సైని పరామర్శించిన వారిలో ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సత్తూర్ నారాయణగౌడ్, బీఆర్ఎస్ నాయకులు అశోక్‌గౌడ్, అఫ్సర్, అసద్ తదితరులు పాల్గొన్నారు.